సాదుం జయరాం కథలు

# 33

# ముడి

ఉదయం నుంచి ఆయన మనసేం బాగుండటం లేదు. ఆ మాటకొస్తే చాలా రోజులుగా ఆయన మనసు బాగుండటం లేదు. బయట ఎక్కడ తిరగడానికి వీల్లేకుండా పోయింది. కాంపౌండులో రెండు వేపచెట్ల మధ్య మంచం వేసుకోవడం - పడుకోవడం - నాలుగైదు నెలలుగా ఇదేవరస. బాత్‌రూం నుంచి బయటకు వస్తూ, కాలుజారి కిందపడ్డాడు. తుంటి ఎముక చిట్లింది. నాలుగైదు పుత్తూరు కట్ల తర్వాత కాలు కట్టుకున్నది. కానీ ఫ్రీగా తిరగటానికి లేదు. ఇంట్లోకి బయటికి తిరగ్గలడు. వేపచెట్ల కింద మంచం వేసుకోవడం - పడుకోవడం - దినచర్య అయిపోయింది. ఆయనకి ఏం తోచడం లేదు. చెట్ల మీద కాకులు చేరి ఒకటే గోల చేస్తున్నవి. ఊరంతా నిశ్శబ్దంగా వుంది. ఆమనికాలం. అంతా పొలాలకు వెళ్లినట్లున్నారు.

'బిందూ!' అంటూ కేకవేశాడు. ఆయన ఆలాకేక వెయ్యడం ఇది రెండవసారి. మొదటి సారికేక ఆ అమ్మాయికి వినిపించలేదు. చాలాసేపటి నుంచి ఆ అమ్మాయి తన అన్నతో ఏదో విషయం మీద సీరియస్‌గా చర్చిస్తున్నది. అందుకని ఆయన కేక వినిపించలేదు. ఈసారి వేసిన కేక వినిపించి బయటకు వచ్చి.

'పిలిచావా నాన్నా!' అంది.

'టైం ఎంతయిందమ్మా?' అన్నాడు ఆయన.

'నాలుగున్నర' అంది బిందు, ఇంట్లోకి తొంగి చూచి.

'ఫ్లాస్కులో కాఫీ వుందా అమ్మా' అడిగాడు.

'ఏమో, చూడాలి నాన్నా' అంటూ ఇంట్లోకి వెళ్ళింది.

కాలం చాలా నిబ్బరంగా వెళుతోంది. అందుకే మాటి మాటికి టైం అడుగుతాడు. ఏం తోచకోతే కాఫీ అడుగుతాడు.

బిందు ఇంట్లోకి వెళ్లి కప్పుతో తెచ్చి ఇచ్చింది.

'ఇప్పటికి ఇది మూడవసారి నాన్నా నువ్వు కాఫీ తాగడం' అంది బిందు.

అతను ఏం మాట్లాడకుండా కాఫీ చప్పరిస్తున్నాడు.

'ఆరోగ్యం చెడిపోదా నాన్నా' బిందు అంది మందలింపు ధోరణితో.

'ఆరోగ్యం చెడిపోతే ఇంకో ఐదేళ్లు ముందు చచ్చిపోతాను. దానివల్ల నష్టమేమిటమ్మా' అన్నాడు నవ్వుతూ.

'నీదంతా రెట్టమతం నాన్నా'

'కాదమ్మా వాస్తవం మాట్లాడుతున్నాను'.

ఉన్నట్టుండి బిందు దృష్టి ఆయన ప్రక్కనే మంచం మీదున్న ఉత్తరం మీద పడింది.

'ఉత్తరం ఎవరు రాశారు నాన్నా' అంది ఆసక్తిగా.

'మీ పెద్దన్నయ్య హైదరాబాద్ నుండి రాశాడు.'

బిందు ఉత్తరం తీసి గబగబా చదవడం మొదలు పెట్టింది.

తనకు కాలు విరగడం మూలానా, ఇంకా ఇంటి ఖర్చులకూ పదివేలదాకా చేబదుళ్లు చేశాడు. అవి తీర్చే మార్గం కనిపించక కొడుక్కి ఉత్తరం రాశాడు. దానికి జవాబు ఆ ఉత్తరం. అడిగినంతా పంపలేదు. సగం మొత్తం మాత్రమే పంపుతున్నట్టు రాశాడు. పిల్లల చదువులతో, భార్య హాస్పిటల్ ఖర్చులతో తానే ఇబ్బంది పడుతున్నాననీ ఐదువేలతో సర్దుకోమనీ రాశాడు. అతను రాసిందాంట్లో వాస్తవం లేదని ఆయనకు తెలుసు. కొడుకు బ్యాంక్ అకౌంటులో మూడు నాలుగు లక్షల దాకా ఉందన్న విషయం ఆయనకు తెలుసు. అడిగిన మొత్తం పంపకుండా సగమే పంపినందుకు ఆయన పెద్దగా బాధపడలేదు. ఆయనకు కొడుకుపట్ల దుర్భ్రమలు లేవు. ఇలాటి సమాధానమే ఏదో ఉంటుందని ముందూ ఊహించాడు. కానీ బిందు ఊహించలేదు.

ఉత్తరం చదివి ఒక నిట్టూర్పు విడిచి, 'మనుషులు ఎందుకు ఇట్లా మారుతారు నాన్నా' అంది.

'ఎంత చెట్టుకు అంత గాలి. వాని ఖర్చులు వానికుంటాయి మరి' అన్నాడు ఆయన.

'ఎంత చెట్టయినా నువ్వు పెంచితే పెరిగిన చెట్టే గదా నాన్నా నీ దగ్గర కూడా బేరం పెట్టాడంటే అన్నయ్య ఎంత నీచుడో ఛీ! ఛీ!' అంది బిందు అసహ్యంగా.

ఆయనకు ఇక ఆ టాపిక్‌ను ముందుకు సాగనివ్వడం ఇష్టం లేదు.

'చెట్లంటే జ్ఞాపకం వస్తోంది. ఈ రెండు వేపచెట్లనీ తిలక్ అమ్మాడా?' అడిగాడు ఆయన.

'ఔను నాన్నా మూడువేలకి అమ్మాడు. రేపో ఎల్లుండో కొడతారనుకుంటా' అంది. ఆయన హృదయం కలుక్కుమంది. ఆ జంట వేపచెట్లతో తనకున్న అనుబంధం అలాటిది. వాటి వెనుక పాత జ్ఞాపకాలు ఉన్నాయి. 1950లో కేంద్రమంత్రిగారొకరు వనమహోత్సవం అన్న కార్యక్రమం ప్రతిపాదించారు. రాష్ట్రమంత్రి, స్వాతంత్ర్య సమరపోరాటంలో తన సహచరుడూ అయిన ఒక మంత్రిగారు ఈ గ్రామం వచ్చారు. గ్రామంలో పెద్దసభ జరిగింది. వందలాది మందికి తన ఇంట్లో భోజనాలు ఏర్పాటయ్యాయి. మంత్రిగారు స్వయంగా ఈ చెట్లు నాటిపోయారు. నాటిన మంత్రిగారు పోయారు. రేపో మాపో తనూ పోవచ్చు. ఈ చెట్లు మాత్రం అజరామరంగా నిలబడి వచ్చే తరాలకు నీడ ఇస్తూనే ఉంటాయనుకున్నాడు. వాటిని రేపో, ఎల్లుండో నరుకుతున్నారంటే ఆయన హృదయం తడి అయింది.

'వాటిని అమ్మకపోతే ఏం బిందూ?' అన్నాడు.

'ఇంటి ఖర్చులకు డబ్బు ఎక్కడ నుండి వస్తుంది నాన్నా' అంది వేదనాభరిత స్వరంతో.

తీగ కదిపితే డొంక కదులుతుంది. అన్ని ఇబ్బందులకూ ఒకరకంగా తనే బాధ్యుడు. కానీ, వాళ్లు తన్ను అందుకు విమర్శించడం లేదు. నిందించడం లేదు. తనేమో నిస్సహాయుడు. సంసార బాదరబందీ అంతా పిల్లల మీదే ఉంది. వాళ్లే ఎలాగే ఈదుకొస్తున్నారు.

ఒకసారి గతం కళ్ళముందు మెదిలింది. తన పెళ్లయ్యే నాటికి వంద ఎకరాల పొలముండేది. బాదూ, బరకా కాదు. బంగారం పండే సుక్షేత్రం. నాలుగైదు కాండ్ల యెద్దులు. ఏడెనిమిది మంది జీతగాళ్లు - ఎప్పుడు చూచినా ఇల్లు కోలాహలంగా ఉండేది. రాజదర్బారులా ఉండేది. ఈ సంపద ఆయనకు సుఖసంతోషాలనివ్వలేదు. గాంధీగారి పిలుపందుకొని స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నాడు. ఇల్లూ, వాకిలీ, పెళ్లాం పిల్లలూ ఏమీ కాబట్టలేదు. మీటింగులూ, పోరాటాలూ, జైళ్లు, ఇదీ ఆయన జీవితం. స్వాతంత్ర్యం వచ్చే నాటికి వంద ఎకరాల భూమిలో ముప్పేసం హారతి కర్పూరంలా హరించిపోయింది. అందులో ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు. అతి సహజం. ఆదర్శాల్నీ, ఆశయాల్నీ నమ్ముకున్న వ్యక్తికి త్యాగాలు అనివార్యం. ఆ త్యాగాల మూలంగా వచ్చిన ఇప్పటి దుస్థితికి ఆయన పెద్దగా ఏనాడూ బాధపడలేదు. ఎందుకంటే జీవితమన్న తర్వాత ఎత్తుపల్లాలు ఉంటాయి. ఓడలు బండ్లవుతాయి. బండ్లు ఓడలవుతాయి.

'ఈ రోజు మీరెందుకో దిగులుగా కనిపిస్తున్నారు నాన్నా' అంది బిందు.

ఆయనేం సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోయాడు. బిందు అంతటితో ఆగలేదు.

'పెద్దన్నయ్య ఉత్తరం చూచి బాధపడుతున్నారా?' అంది.

'బాధ ఎందుకమ్మా, వాడు డబ్బు పంపుతున్నాడు గదా' అన్నాడు చిరునవ్వుతో.

'పోనీ తిలక్ అన్నయ్యతో ఈ చెట్లు అమ్మవద్దని చెప్పమంటావా?' అంది.

బిందు ఆత్మీయత అతని హృదయాన్ని ఒక కుదుపు కుదిపింది. ఆయన కళ్లు చెమ్మగిల్లాయి.

'నేనేం దిగులుగా లేనమ్మా. నన్ను గురించి నువ్వు అనవసరంగా దిగులు పడుతున్నావు. పొద్దు గూకుతోంది. ఇంట్లోకి వెళ్లాం పదమ్మా' అన్నాడు.

బిందు భుజం ఆసరాగా ఆయన మెల్లగా నడిచి ఇంట్లోకి వచ్చి ఈజీ చెయిర్లో రిలాక్సు అయ్యాడు. కళ్లు మూసుకొని పడుకున్నాడు. కానీ కళ్లవెంట ఏకధారగా నీరు కారుతున్నది. మాటిమాటికి ఉదయం నుంచి జరిగిన రెండు సంఘటనలే జ్ఞాపకం వస్తున్నవి. అవి ఆయన అంతగా విచలితుడు కావడానికి కారణాలు!

ఉదయం కాఫీ త్రాగిన తర్వాత దినపత్రిక తిరగవేస్తున్నాడు. తిలక్ వచ్చి పక్కన కూర్చున్నాడు. వాడు తనతో ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడటానికి వచ్చాడని ఆయన మనసుకు తట్టింది. కానీ తిలక్‌ను పలకరించలేదు. తిలక్‌కు ఆయనంటే భయభక్తులు. చాలాసేపు నోరు మెదపకుండా అలాగే కూర్చున్నాడు. ఎంతసేపు చూచినా ఆయన పేపరు చదవడంలో లీనమయ్యే ఉన్నాడు. ఇక లాభం లేదనుకున్నాడో ఏమో 'నాన్నా!' అని పిలిచాడు.

ఆయన అప్పుడు పేపరు మడిచి పక్కన పెట్టి తిలక్ వంక చూశాడు. సంభాషణ ఎలా ప్రారంభించాలో తిలక్‌కు తోచలేదు. ఒక్కక్షణం నిశ్శబ్దం తాండవించింది. ఎలాగో నోరు పెగిల్చి 'మొన్న బిందుకు పెళ్లిచూపులకు వచ్చిన వాళ్లు లక్ష రూపాయల కట్నం అడుగుతున్నారు' అన్నాడు. ఆయన కొడుకు ముఖం వంక ఒక క్షణం అయోమయంగా చూశాడు. తను కేవలం నిమిత్తమాత్రుడు. వేళకింత కుండలో కలిగింది పెడితే తిని పడుకోవడం తప్ప సాంసారిక బాధ్యతలకు దూరంగా ఉంటున్నాడు. అరవై ఏళ్ల జీవయాత్రయలో ఆయన గుండెలు అలసిపోయాయి. అప్పులతో కుప్పకూలిన సంసారాన్ని కొడుకు చేతికి అప్పగించాడు. దారిలో అడుగడుగునా గతుకులున్నా బండిని వాడే లాగుతున్నాడు. ఇపుడీ విషయం తనతో చెప్పడమెందుకో ఆయనకు అర్థం కాలేదు.

'కట్నం అడగకుండా బిందును చేసుకుంటారని పెళ్లిచూపులు ఏర్పాటు చేశావా?' అన్నాడు ఆయన.

'మీరు అనుకున్నట్లు నేను అంత అమాయకంగా ఆలోచించలేదు. నాకొచ్చే కట్నంతో దాని పెళ్లిచేద్దామనుకున్నాను. కానీ......'

ఈ మధ్యనే తిలక్‌కు ఒక సంబంధం వచ్చింది. ఆ విషయం ఆయనకు తెలుసు. కానీ దాని పూర్తి వివరాలు ఆయనకు తెలియవు. ఆయన తిలక్‌ను అడగనూ లేదు. వాడు ఆ విషయాలు చెప్పనూ లేదు.

'నీకొచ్చిన సంబంధం విషయం ఏం చేశారు?' అన్నాడు ఆయన.

'అలాగే పెండింగ్‌లో ఉంది. మనం నాయుడుగారి కాలేజీలో లెక్చరరు పోస్టు వేయించుకోగలిగితే రెండు లక్షలు కట్నం ఇస్తామంటున్నారు.'

'మంచిదే. బాగానే ఉంది. కానీ........ ఉద్యోగాలు వేయించుకోవడానికి మన చేతుల్లో ఏముంది?' అన్నాడు ఆయన.

'ఏ ప్రయత్నమూ చెయ్యకుండా మన చేతుల్లో ఏముందు అనుకుంటూ కూర్చుంటే ఉద్యోగాలు వాటంతట అవే మనకాళ్ల దగ్గరికి రావు. మీరు వెళ్లి ఒకసారి నాయుడిగార్ని కలవండి. అంటూ తిలక్ ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

'జీవితంలో ఎవర్నీ ఏమీ ఎప్పుడూ యాచించలేదు. ఆత్మాభిమానం చంపుకుని నీ ఉద్యోగ విషయమై నాయుడుని కాళ్లా వేళ్లా పడమంటావా?' అన్నాడు ఆయన.

తండ్రి ధోరణి చూడగానే తిలక్ ముఖంలో నెత్తురు చుక్కలేకుండా పోయింది. గొంతుతడారిపోయింది. చాలాసేపటికి ఈ స్థితి నుండి తేరుకొని అన్నాడు.

'జీవితం వైయక్తికం కాదు నాన్నా' అన్నాడు తిలక్ కంఠదగ్గంగా ముంచుకొచ్చిన ఆవేశాన్ని అణచుకొని.

తిలక్ ఏమంటున్నాడో ఆయనకు అర్థం కాలేదు. మునుకున ఉండి రాయి విసిరినట్లుగా ఉంది ఆ మాట.

'నువ్వంటున్నదేమిటో నాకు అర్థం కావడం లేదు' అన్నాడు ఆయన.

'రెండు లక్షలు కట్నంతో వచ్చే అమ్మాయిని పెళ్లి చేసుకోవడం నాకు ఇష్టంలేదు. నా అంత చదువూ, సంస్కారమూ ఉన్న అమ్మాయిని పెళ్లి చేసుకోవాలన్నది నా జీవితాశయం. నా ఆశయాన్ని పట్టుకొని వేలాడుతూ కూర్చుంటే, నాకు కట్నం రావకపోవచ్చు. బిందు పెళ్లి ఆగిపోతుంది. దాని పెళ్లి చెయ్యడం నా బాధ్యత. జీవితం సామాజిక గతితో ముడిపడివుంది' అని ఒక క్షణం ఆగాడు. తిలక్ కొంచెం తటపటాయించాడు. చివరకు మళ్లీ అన్నాడు.

'వారసత్వంగా వచ్చిన ఆస్తిపాస్తులుంటే ఎవర్నీ ఏమీ యాచించనక్కర్లేదు. ఆదర్శాలూ, ఆశయాలూ కూడా పాటించవచ్చు. ఇన్నాళ్లూ మీరు ఆ పనే చేశారు. ఆస్తి హారతి కర్పూరంలా హరింపచేశారు. అభం శుభం తెలియని బిందు ఉంది. దానికి పెళ్లి చేసి అత్తగారింటికి పంపవలసిన బాధ్యత మనమీద ఉంది. దాని పెళ్లికీ నా ఉద్యోగానికీ ముడిపడివుంది. దాని భవిష్యత్తును గాలికి వదిలేసి, మీ ఆత్మాభిమానాన్ని కాపాడదలచుకుంటే - నాకు అభ్యంతరం లేదు. మీ ఇష్టం!' అంటూ చివుక్కున లేచి ఇంట్లోకి వెళ్లిపోయాడు.

కొడుకు నోటినుంచి ఇంట కటువైన మాటలు వస్తాయని ఆయన ఊహించలేదు. గుండెల్లో బాకుతో పొడిచినట్టుగా అయింది. కానీ కొడుకు మీద కోపం రాలేదు. తనమీద తనకే జాలివేసింది. ఎన్నడూ తన ఎదురుగా నిలబడి మాట్లాడనివాడు అంతమాటలన్నాడు. ఆ బాధని ఎన్ని రోజులుగా కడుపులో దాచుకున్నాడో ఏమో - ఇవ్వాళ వెళ్లగ్రక్కాడు. అందులో నికార్సయిన నిజం ఉంది!

బిందు తలుపు చాటునుంచి ఈ మాటలన్నీ వింది. మధ్యాహ్నం వరకు ఒకరి గుండె చప్పుళ్లు మరొకరికి వినిపించేంత నిశ్శబ్దం అలముకొంది. మధ్యాహ్నం ఆయన భోం చెయ్యలేదు. తిలక్‌ను పలిచి 'నాయుడి దగ్గరికి వెళ్తున్నాను. ఏదన్నా బండి ఏర్పాటు చెయ్యి' అన్నాడు.

ఆయన నాయుడి గారి ఆఫీసుకు వెళ్లేసరికి ఆఫీసు చాలా హడావుడిగా ఉంది. ఎంతైనా నాయుడుగారు ఎక్స్ మినిస్టరు! ప్రజెంట్ ఎమ్మెల్యే! వచ్చే జనం - పోయే జనం సంతలాగా ఉన్నది. ఆయన ఇలాటి హడావిడి మునుపెన్నడూ చూచి ఎరగడు. ఇంటర్వ్యూ దొరుకుతుందా దొరకదా అన్నా సందేహం కలిగింది. కానీ ఎవరు చెప్పారో ఏమో ఆయన రాక విషయం నాయుడు గారితో చెప్పారు. నాయుడుగారు వాకిట్లోకి వచ్చి ఆయన్ని లోపలికి రమ్మని పిలిచాడు.

'మీ రాకతో మా ఆఫీసు పావనమైంది' నాయుడు నవ్వుతూ అన్నాడు. నాయుడికి తనపట్ల అంత గౌరవం ఉందని ఆయన ఊహించలేదు. కాఫీ తెప్పించి ఇచ్చి, 'ఏదన్నా పనివుంటే ఫోన్ చేయకపోయారా?' అన్నాడు నాయుడు.

'నాకు ఫోన్ ఎక్కడిదయ్యా?' అన్నాడు ఆయన.

'పోనీ కాకితో కబురంపితే నేనే వచ్చేవాణ్ణి కదా? కుంటుకుంటూ పెద్దాయన ఇంతదూరం వచ్చారంటే నాకు బాధగా ఉంది అన్నాడు.

నాయుడి ఆప్యాయత చూచి అంతటి స్వాతంత్ర్య సమరయోధుడికీ - నీతికీ, నిజాయితీకి ఇంకా గౌరవం ఉన్నదనే అనిపించింది. విషయం ఎట్లా మొదలుపెట్టాలో ఆయనకు అర్థం కాలేదు.

'మీ ఆఫీసు చాలా సందడిగా ఉంది. ఏం పనుల మీద వస్తారు వీళ్లంతా అన్నాడు ఆయన.

నాయుడు చిద్విలాసంగా ఒక చిరునవ్వు నవ్వి 'బెల్లం ఉంటే ఈగలు ముసుకుకుంటాయి. అధికారం ఉంటే జనాదులు అలాగే ముసురుకుంటారు. మనుషుల్లో స్వార్థం బలిసిపోయింది. ఉద్యోగాలూ, కాంట్రాక్టులూ, పర్మిట్లూ ఇలా నానా కోర్కెలతో వస్తారు. ప్రజాహిత కార్యక్రమాల కొచ్చేవాడు ఒక్కడంటే ఒక్కడు కనిపించడు. ఎమ్మెల్యే పదవికీ 'టౌట్' పనికీ తేడాలేకుండా పోయింది. ఇష్టమున్నా లేకపోయినా ఈ పనులన్నీ చేసి పెట్టాలి. మా రాజకీయ భవిష్యత్తు వీళ్లతో ముడిపడి ఉంది' అంటూ గోడు వెళ్లబోసుకున్నాడు.

ఎమ్మెల్యే సంధించిన బాణం తనకూ తగిలింది. మనకు కలుక్కుమంది. ఉండబట్టలేక.

'యధారాజా తధాప్రజా' అన్నాడు.

మీరేమి అనుకోకపోతే 'యధా ప్రజా తధా రాజా' అనినేనంటాను అన్నాడు నాయుడు.

ఈ వాదన ఆయనకు నచ్చలేదు. తను ఉద్యోగం యాచించడానికి వచ్చాడు. యాచనా దైన్యం ఆయన నోరు నొక్కింది. మౌనంగా ఉండిపోయాడు.

'ఇంతకూ మీరు ఏం పనిమీద వచ్చారో చెప్పనే లేదు. చెప్పండి' అన్నాడు నాయుడు. ఇందాక జరిగిన సంభాషణల మూలాన వచ్చిన పని చెప్పడానికి ఆయనకు సిగ్గయింది. కానీ చల్లకొచ్చి ముంతదాచుకుంటే లాభంలేదు.

'మా అబ్బాయికి మీ కాలేజీలో పోస్టు కావాలయ్యా నాయుడూ' అన్నాడు.

నాయుడుగారు కళ్లు మూసుకొని కాసేపు ఆలోచనలో పడ్డాడు.

ఎలాటి సమాధానం వినవలసి వస్తుందోనని గుండెలు కొట్టుకుంటున్నాయి. ఆ సమాధానంతో కొడుకు పెళ్లి ముడిపడివుంది. వాడి పెళ్లి ఉద్యోగంతో ముడిపడి ఉంది. బిందు పెళ్లి ఆరెంటితోనూ ముడిపడివుంది.

ఆయనకు నాయుడుగారి ముఖంలోకి చూడటానికి కూడా ధైర్యం చాలడం లేదు.

'సబ్జెక్టు ఏమిటి?' అన్నాడు నాయుడు.

'ఇంగ్లీషు, ఎం.ఫిల్ కూడా పూర్తిచేశాడు' అన్నాడు ఆయన.

'ఓ.కే. రేపే వెళ్లి జాయిన్ కమ్మని చెప్పండి. కరస్పాండెంట్‌కు ఫోన్ చేసి చెబుతాను' అన్నాడు నాయుడు.

క్షణాలమీద పని జరిగిపోయింది. సునాయాసంగా పని జరిగిపోయింది.

ఇది కలో నిజమో అన్నంత సందేహం కలిగింది. విపరీతమైన సంతోషంతో ఆయన మెదడు మొద్దుబారిపోయింది.

'ఇక మీరు వెళ్లిరండి. నేను చాలా బిజీగా ఉన్నాను' అన్నాడు నాయుడు.

ఆయన లేచి బయలుదేరగానే నాయుడు కాంపౌండు గేటు వరకు వీడ్కోలు చెప్పడానికి వచ్చాడు.

'మీరు నిలబడండి, నేను వస్తాను! సెలవు' ఆయన అన్నాడు.

'ఒక్కమాట విని వెళ్లండి. ఎలక్షన్లు దగ్గర్లో ఉన్నవి. మీ పంచాయతీలో మూడువేల ఓట్లున్నవి. అక్కడ అంతా మీ మనుషులే. ప్రతిసారీ మీరే అడ్డుపడుతున్నారు. కాటికి కాళ్లు చాచుకొని ఉన్నారు. ఇంకా మీకు రాజకీయాలెందుకండీ హాయిగా విశ్రాంతి తీసుకోక? ఇప్పటి నుంచి ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోండి ఉంటాను' అంటూ, ఔననడానికీ కాదనడానికీ ఆయనకు అవకాశం ఇవ్వకుండానే నాయుడు వెళ్లిపోయాడు. ఆయన అప్రతిభుడయిపోయాడు. ఆ పంచాయతీలో ప్రజాస్వామ్యం ఖూనీ కాకుండా చాలాకాలంగా కాపాడుకొని వస్తున్నాడు. ఇవ్వాళ కొడుకు ఉద్యోగానికి దాన్ని మూల్యంగా చెల్లించమని నాయుడు అడిగాడు!

దారి పొడుగునా ఆయన్ని ఈ సమస్యలు వదలకుండా వేధిస్తూనే ఉన్నవి. ఇల్లు చేరుకున్న తర్వాత వెళ్లినపని ఏమైందని బిందు అడగలేదు. తిలక్ అడగలేదు.

చీకటిపడ్డ తర్వాత తిలక్ వచ్చాడు. ఇంట్లోకి వెళ్తున్న వాడ్ని ఆపి.

'రేపు వెళ్ళి ఉద్యోగంలో జాయినవ్వు తిలక్' అన్నాడు. అని మళ్లీ కళ్లు మూసుకున్నాడు. ఆయన కనురెప్పలకింద తడి తిలక్ కంటపడలేదు.

- (1995, సాహిత్యనేత్రం)